నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, శనివారం 6 జూలై 2024 | PEDDAPALLI

మధ్యమానేరు పరిహారం చెల్లింపుల్లో

# మళ్లీ అక్రమాలు?



మధ్యమానేరు ముంపు గ్రామం చింతల్‌ఠాణా

- చింతలఠాణా వేదికగా బాగోతం
- బైనంబర్లతో లేని ఇండ్లకు చెల్లింపులకు యత్నం
- వేగంగా కదులుతున్న ఫైల్
- ఓ ఇద్దరు అధికారులే కీలక సూత్రదారులనే ఆరోపణలు
- పైరవీదారులకు సహకారం
- ఉన్నతాధికారులను పక్కదారి పట్టించే ప్రయత్నం
- పరిహారం వస్తే అందులో 50శాతం అధికారులకు చెల్లించడానికి ఒప్పందాలు?

**మధ్యమానేరు పరిహారం చెల్లింపుల్లో మళ్లీ అక్రమాలకు తెరలేపుతున్నారా..? పాత దందా నడిపేందుకు ప్రయత్నిస్తున్నారా..? అందులో కొంత మంది అధికారులే సూత్రధారులుగా మారుతున్నారా..? పైరవీ దారులకు సహకారం అందిస్తున్నారా..? అంటే అవుననే సమాధానమే వస్తున్నది. తాజాగా ముంపు గ్రామాల్లో ఒకటైన చింతల్‌ఠాణాలో లేని ఇండ్లకు బైనంబర్లు సృష్టించి, దాదాపు ₹2 కోట్ల పరిపహారం కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ బాగోతంలో ఏండ్లుగా పాతుకుపోయిన ఓ ఇద్దరు అధికారులే కీలకసూత్రధారులనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం ఇప్పిస్తే వచ్చిన డబ్బుల నుంచి 50 శాతం అమౌంట్ తమకే ఇవ్వాలంటూ సదరు అధికారులు ఒప్పందాలు చేసుకుంటూ ఫైల్‌ను చకచకా ముందుకు తీసుకెళ్తున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై నిజమైన లబ్ధిదారుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది.**

కరీంనగర్, జూలై 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మధ్యమానేరు పరిహారం విషయంలో గతంలో అనేక అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. ఆ మేరకు అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు అనేక చర్యలు తీసుకున్నది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం రావడంతో మళ్లీ కొంత మంది అధికారులు అక్రమాలకు తెరలేపుతున్నట్టు తెలుస్తున్నది. అందుకు చింతల్‌ఠాణా గ్రామం వేదికగా.. అక్కడ లేని కొన్ని ఇండ్లకు బై నంబర్లు సృష్టించి, దాదాపు రెండు కోట్ల పరిహారం చెల్లింపునకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం అందుతున్నది. నిజానికి ఈ వ్యవహారం గతంలో ఉన్నతాధికారులకు దృష్టికి రావడంతో విచారించి, వాటిని బోగస్‌గా నిర్ధారించి పక్కన పెట్టారు. దీంతో ఇన్నాళ్లు మౌనంగా ఉన్న పైరవీకారులు, ఇప్పుడు ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారులు మారడంతో మళ్లీ అక్రమాలకు తెరలేపుతున్నారు. చింతల్‌ఠాణాకు సంబంధించి కొన్ని ఇండ్లకు బై నంబర్లు వేసి.. సదరు వ్యక్తులకు డబ్బులు ఇప్పించేందుకు ఓ ఇద్దరు అధికారులు కీలక సూత్రదారులుగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ బై నంబర్ల ఇండ్ల సమాచారం గ్రామ పంచాయతీల్లో లేదని తెలిసింది. అంతేకాదు, ఒకటైన చింతలఠాణాలో ఇండ్ల పరిహారం చెల్లింపునకు 2007లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సర్వే చేశారు. మొత్తం 710 ఇండ్లు ఉన్నట్లుగా గుర్తించి, వాటికి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారపగ్గాలు చేపట్టగానే అంటే.. 2014 నుంచి ముంపు గ్రామస్తులకు దశలవారీగా పరిహారం చెల్లించింది. ఒకటి రెండు సంవత్సరాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసింది. అయితే పరిహారాన్ని కాజేసిన కొంత మంది పైరవీకారులు, అధికారులు అప్పట్లో చింతల్‌ఠాణాలోనూ దండుకున్నట్టు బహిర్గతం కావడంతో చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం మరోసారి అక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తున్నది. అందుకు సంబంధించి ఫైల్‌ను (ఎల్‌ఆర్ నంబర్ ఇ/30/2008/తేది 6-2024) చకచకా ముందుకు తీసుకెళ్తున్నట్టు తెలిసింది. నిజానికి ప్రస్తుతం చెబుతున్న ఇండ్ల వివరాలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇచ్చిన అంచనాల్లో లేవు. ఆ విషయాన్ని పక్కన పెట్టి.. బైనంబర్ల పేరిట కొత్తవి సృష్టించి వ్యవహారం నడుపుతున్నారు. ఈ ఫైల్‌పై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తాజాగా స్పెషల్ డిప్యూట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దీనిపై విచారణ చేస్తున్న అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి, అంతా ఒకే అనేలా ఫైల్ తయారు చేయించి, కలెక్టర్ ద్వారా పరిహారం పొందేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఏళ్లుగా పాతుకపోవడంతోపాటు ఇటువంటి వ్యహారాల్లో రాటుతేలిన ఇద్దరు అధికారులు.. ఈ అక్రమాలకు అండగా ఉండడమే కాకుండా.. వారే దగ్గరుండి ఈ బాగోతాన్ని నడుపుతున్నారనే విమర్శలున్నాయి. అందుకుగానూ సదరు వ్యక్తుల నుంచి 50 శాతం పరిహారం చెల్లింపునకు ఒప్పందాలు చేసుకున్నట్టు సమాచారం.

### అందరి చూపు.. ఆ ఆరు కోట్లపైనే?

నిజానికి మధ్యమానేరుకు సంబంధించి కోర్టుల్లో ఉన్న పిటిషన్లు, కొన్ని కుటుంబ తగాదాల వంటి వివిధ కారణాలతో కొంత మందికి పరిహారం అందలేదు. ఈ విషయం మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి వెళ్లడంతో పరిహారం రాని వ్యక్తుల వివరాలు పూర్తిగా సేకరించి ఇవ్వాలని అప్పటి కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ మేరకు కలెక్టర్ ప్రత్యేకాధికారులను నియమించారు. ఆ అధికారులు అన్ని కోణాల్లో విచారణ జరిపి మొత్తం ₹42 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉన్నట్టు లెక్కలు తేల్చారు. ఇవి చెల్లిస్తే పరిహారం చెల్లింపుల ప్రస్తావన ఇక ఉండదని తమ నివేదికలో స్పష్టం చేశారు. ఈ సమస్యను సానుకూల దృక్పథంతో చూసిన కేటీఆర్, ప్రభుత్వం నుంచి ముందుగా ₹14 కోట్లు విడుదల చేయించారు. మిగిలినవి విడుదల చేయించేలోగా ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మంజూరైన ₹14 కోట్ల నుంచి అర్హులైన ముంపువాసులకు ₹8 కోట్లు చెల్లింపులు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా మిగిలిన ₹6 కోట్లు ప్రభుత్వ ఖాతాలోనే ఉండిపోయాయి. దీంతో ఇప్పుడు పైరవీకారుల దృష్టి మిగిలిన ఆరు కోట్ల రూపాయలపై పడింది. ఎలాగైనా వీటిని కాజేయాలన్న లక్ష్యంతో ఒక్కో పైరవీకారుడు ఒక్కో పద్ధతిలో ముందుకు వెళ్తుండగా, చేయి తిరిగిన ఇద్దరు అధికారులు అందులో కీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా చింతల్‌ఠాణా నుంచి ఓ ఇద్దరు వ్యక్తులు పైరవీకారులుగా మారి ఈ దందాలో నిమగ్నం అవుతున్నట్టు తెలుస్తున్నది. పరిహారం వస్తే.. అందులో 50 శాతం ఇచ్చేందుకు వీరు ఒప్పందాలు చేయించినట్టు తెలిసింది. ఈ విషయంలో ఏమాత్రం తొందరపడినా డబ్బులు అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లనుండగా, నిజమైన ముంపువాసులకు అన్యాయం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులు, ముఖ్యంగా కలెక్టర్.. ప్రత్యేక చొరవ చూపి ఈ అక్రమాలకు అడ్డు కట్టవేయాల్సిన అవసరముందన్న వాదనలు వస్తున్నాయి. అంతేకాదు, అక్రమార్కులను ప్రోత్సహిస్తున్న సదరు ఇద్దరు అధికారులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తున్నది. ఏళ్లుగా పాతుకుపోయి అక్రమాలకు పాల్పడుతూ.. ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్న సదరు అధికారులపై చర్యలు తీసుకోకపోతే.. మళ్లీ ఇలాంటి పరిణామాలే పునరావృతమయ్యే ముప్పు ఉంటుంది. దీని ద్వారా నిజమైన లబ్ధిదారులు పరిహారం కోసం.. మళ్లీ నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడుంది. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

# అవినీతి కూపం.. డీసీఎంఎస్

- కొనుగోలు కేంద్రాలకు చెల్లించాల్సిన కమీషన్‌లో కక్కుర్తి
- ఎరువుల దుకాణం పేరిట అక్రమ దందాకు తెరలేపిన మేనేజర్
- ₹లక్ష లంచం తీసుకుంటుండగా పటుకున్న అధికారులు
- ఏసీబీ విచారణలో బయట పడుతున్న అక్రమాలు
- సంబురాలు చేసుకుంటున్న సెంటర్ నిర్వాహకులు
- వెంకటేశ్వర్‌రావు అక్రమాలపై డీసీవోకు ఫిర్యాదు చేసిన హుజూరాబాద్ కాంప్లెక్స్ లీజు దారులు



వెంకటేశ్వర్‌రావు పెట్టిన బాధలను డీసీవోకు చెబుతున్న డీసీఎంఎస్ కాంప్లెక్స్ లీజుదారులు

**జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (డీసీఎమ్మెస్) అవినీతికి అడ్డగా మారింది. ఏళ్ల తరబడిగా తిష్టవేసిన అధికారులు.. ప్రతి పనికో ఓ రేటు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నట్టు బయటపడుతున్నది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అండగా నిలిచి ప్రొత్సహించాల్సింది పోయి వారిని కాల్చుక తింటున్నట్టు బహిర్గతమవుతున్నది. కొన్నాళ్ల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, తాజాగా సొసైటీ బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ₹లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో అవినీతి తిమింగళాల బాగోతం బట్టబయలైంది. వీరి అక్రమాలకు ఒక్క కావటి రాజు మాత్రమే కాదు, 75 శాతం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇదే తరహాలో ఇబ్బందులు పడినట్టు వెలుగులోకి వస్తున్నది. అంతేకాదు, వీరి వ్యవహారం నచ్చక చాలా మంది నిర్వాహకులు నష్టాన్ని భరించి బయటకు వెళ్లిపోయినట్టు తెలుస్తున్నది. డీసీఎమ్మెస్‌లో జరిగే అక్రమాల వెనుక వెంకటేశ్వర్‌రావు హస్తమే ఉందనే విమర్శలు వస్తుండగా, తాజాగా హుజూరాబాద్ డీసీఎమ్మెస్ కాంప్లెక్ లీజుదారులు.. డీసీవోను కలిపి ఫిర్యాదు చేయడం వెంకటేశ్వర్‌రావు అవినీతికి అద్దంపడుతున్నది.**

కరీంనగర్, జూలై 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / ముకరంపుర : అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంట కొనుగోలుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామానికో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సొంతూరులోనే మద్దతు ధరకు సకాలంలో ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించింది. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మహిళా సంఘాలతో పాటు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (డీసీఎమ్మెస్) గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా అన్ని విభాగాలు కలిపి సుమారు 1300లకుపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా.. అందులో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో 200 పైచిలుకు ఏర్పాటు చేస్తున్నారు. అందు కోసం సెంటర్ నిర్వాహకులను నియమించి కార్యకలాపాలు నడుపుతున్నారు. డీసీఎమ్మెస్ కొన్న ధాన్యానికి పౌరసరఫరాల శాఖ క్వింటాలుకు ₹32చొప్పున కమీషన్ అందిస్తుంది. అందులో ₹16 డీసీఎమ్మెస్‌కు, మిగిలిన ₹16 కేంద్రం నిర్వాహకులకు చెల్లించాలి. వచ్చే ఈ కమీషన్‌తోనే సెంటర్ వద్ద సుతిల్ దారం నుంచి తాగునీటి సౌకర్యం వరకు కల్పించాలి. పౌరసరఫరాల శాఖ ద్వారా వచ్చే గన్నీ బ్యాగులను దించుకునేందుకు హమాలీ చార్జీలు చెల్లించాలి. లారీలు వచ్చినప్పుడు లోడింగ్ ఆలస్యం జరిగితే సంబంధిత డ్రైవర్లకు భోజనాలు పెట్టించాలి. తూకాలు వేయడం, లోడింగ్ చేయడం వంటి వాటిని పరిశీలనకు ఒక బుక్‌కీపర్, మూమెంట్ రిజిస్ట్రేషన్‌కు ఒకరు, ట్రక్‌షీట్, రైతులకు రసీదులు, మిల్లులకు తీసుకెళ్లి రైతులతో జాయింట్ అగ్రిమెంట్ వంటి పనులు చేయడానికి మరికొందరు వ్యక్తులను నియమించుకొని.. వారికి వేతనాలు ఇవ్వాలి. ఇవే కాకుండా ఏటా తూనికలు కొలతల శాఖాధికారులు వచ్చి వేసే ముద్రలకు స్టాంప్ డ్యూటీని నిర్వాహకులే చెల్లించాలి. ఇలా సెంటర్ వద్ద జరిగే ప్రతి ఖర్చునూ భరించాలి. కానీ, డీసీఎమ్మెస్‌కు మాత్రం ఏ ఖర్చు ఉండదు. వచ్చిన ₹16 కమీషన్ నేరుగా సంస్థకు మిగులుతుంది. నిర్వాహకులు చెబుతున్న దాని ప్రకారం చూస్తే క్వింటాలుకు ₹16 కమీషన్ వస్తే.. అందులో ఖర్చు ₹10 నుంచి ₹11 వరకు వస్తుంది. అంటే క్వింటాలుపై సెంటర్ నిర్వాహకులకు మిగిలేది కేవలం ₹4 నుంచి ₹5 వరకే ఉంటుంది.

### కమీషన్ ఇవ్వకుండా తిప్పలు

నిజానికి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎంత బాగా పనిచేస్తే అంత ధాన్యం కొనుగోలు ఎక్కువగా జరుగుతుంది. తద్వారా డీసీఎమ్మెస్‌కు కమీషన్ అధికంగా రావడానికి ఆస్కారముంటుంది. దీంతో సెంటర్ నిర్వాహకులు బాగుపడుతారు. కానీ, డీసీఎమ్మెస్‌లో మాత్రం ఇది పూర్తి విరుద్ధం. పౌరసరఫరాల శాఖ నుంచి వచ్చిన కమీషన్‌లో సగం డీసీఎమ్మెస్ ఉంచుకొని.. మిగిలిన సగాన్ని ఎప్పటికప్పుడు సెంటర్ నిర్వాహకులకు చెల్లించి వారిని మరో సీజన్‌కు సన్నద్ధం చేయాలి. కానీ, ఈ కార్యాలయంలో తిష్ట వేసిన బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు ఇతర అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఏసీబీకి పట్టుబడడం అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. డీసీఎమ్మెస్ కొన్నేళ్లుగా పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తిలో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. ఇదే గ్రామానికి చెందిన కావటి రాజుకు కొనుగోలు కేంద్రం బాధ్యతలు అప్పగించింది. 2018-19 నుంచి 2023-24 వానకాలం సీజన్ వరకు 5.26లక్షల క్వింటాళ్ల ధాన్యం ఈ సెంటర్‌లో కొనుగోలు జరిగింది. 2019-20లో 55వేల క్వింటాళ్ల మక్కల కొనుగోలు జరిగింది. వీటికి సంబంధించి సివిల్ సప్లై శాఖ డీసీఎమ్మెస్‌కు క్వింటాల్‌కు ₹32చొప్పున కమీషన్ ఇచ్చింది. అందులో ₹16 డీసీఎమ్మెస్ ఉంచుకొని.. మిగిలిన ₹16 సెంటర్ నిర్వాహకులకు చెల్లించాలి. నిజానికి ఎప్పటికప్పుడు వచ్చిన కమీషన్ చెల్లించి అండగా నిలువాలి. కానీ, అధికారులు కమీషన్ ఇవ్వకుండా ఏళ్ల తరబడిగా పెడింగ్ పెడుతున్నారు. అడిగినంత ముట్టజెప్పిన వారికే కమీషన్ ఇస్తున్నారు. లేదంటే కుంటి సాకులు చెప్పి నిర్వాహకులను ముప్పుతిప్పులు పెడుతున్నారు. ఇందుర్తి కేంద్రం నిర్వాహకుడు కావటి రాజుకు సుమారు ₹60లక్షల వరకు చెల్లించాల్సి ఉన్నా.. వాటిని పెడింగ్‌లోపెట్టారు.

### పాపం పండింది

తమ సెంటర్‌కు రావాల్సిన కమీషన్‌ను చెల్లించాలని నిర్వాహకులు రాజు కొన్నేళ్లుగా డీసీఎమ్మెస్ అధికారులకు మొర పెట్టకుంటున్నా కనికరం చూపలేదు. చివరకు అధికారులు తమదైన వ్యూహం రచించారు. బాధితుడిని తమ దారిలోకి తెచ్చుకునేందుకు రంగం సిద్ధం చేశారు. కమీషన్ ఇవ్వడానికి కుదరదని, వాటికి సరిపోయేలా ఎరువులు సరఫరా చేస్తామని చెప్పి, రాజుతో ఇందుర్తిలో ఓ ఎరువుల దుకాణం పెట్టించారు. దానికి సైతం రాజు ఒప్పుకున్నాడు. ఆ మేరకు డీసీఎమ్మెస్ మేనేజర్ కొద్ది రోజుల క్రితం రాజుకు నాలుగు లారీల ఎరువులను పంపించాడు. అయితే అందులోనూ అవినీతిని ప్రదర్శించారు. బహిరంగ మార్కెట్లో 28-28 అనే ఎరువు బస్తా ₹1555కు లభిస్తుండగా.. అధికారులు మాత్రం ₹1580 రేటు వేసి రాజుకు సరఫరా చేసినట్టు ఏసీబీ ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు. అందులోనూ కమీషన్‌ను దండుకున్నట్టు తెలుస్తున్నది. ఏదో రూపంలో తమ కేంద్రానికి రావాల్సిన కమీషన్ వస్తే చాలనుకున్న రాజు ఎరువుల బస్తాలను తీసుకునే క్రమంలో ప్రతి లారీకి రూ.లక్ష చొప్పున చెల్లించాలంటూ మేనేజర్ మళ్లీ డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని అశ్రయించగా, లక్ష లంచం తీసుకుంటుండగా బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావుతోపాటు మరో అధికారి రెడ్‌హ్యాడెండ్‌గా పట్టుబడ్డారు. వెంకటేశ్వర్‌రావు డీసీఎమ్మెస్‌లో పాతుకుపోయాడు. ఆయన కనుసన్నల్లోనే కార్యకలాపాలు జరిగేవి. పాలకవర్గాలకు కూడా ఆయన చెప్పిందే వేదం. దీంతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇప్పుడు ఆయన పాపం పండిందన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. ఆయన గురువారం ఏసీబీకి చిక్కిన విషయం తెలిసి చాలా మంది సెంటర్ నిర్వాహకులు ఏకంగా సంబరాలు చేసుకుంటున్నారు.

### వెంకటేశ్వర్‌రావుపై డీసీవోకు ఫిర్యాదు

న్యాయం చేయాలని వేడుకున్న డీసీఎమ్మెస్ లీజుదారులు

వెంకటేశ్వర్‌రావు అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. హుజూరాబాద్‌లోని 20 మంది డీసీఎమ్మెస్ కాంప్లెక్స్ లీజుదారులు శుక్రవారం డీసీవో రామానుజచార్యులను కలిసి ఫిర్యాదు చేశారు. అద్దె విషయంలో వెంకటేశ్వరావు నియంతలా వ్యవహరించాడని, నిబంధనలకు విరుద్ధంగా.. ఇష్టారాజ్యంగా అగ్రిమెంట్లు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేంటని అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమని, లేదంటే కోర్టుకుపో అని వ్యంగ్యంగా మాట్లాడేవాడని వాపోయారు. బహిరంగ వేలంలో షట్టర్ పొందిన తమను ముప్పుతిప్పులు పెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వరావు చేసిన దుర్మార్గపు పనులకు చాలామంది దుకాణాదారుల బతుకులు రోడ్డున పడ్డాయని చెప్పారు. విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో లీజుదారులు మురికి అనిల్‌కుమార్, కొమురా మల్లారెడ్డి, గోలి దివాకర్, యాంసాని చంద్రమొగిలి,మూషం వెంకటనారాయణ పాకాల రవీందర్‌రెడ్డి, స్వర్గం లక్ష్మీనారయణ, తలకొక్కుల శ్రీకాంత్‌లతోపాటు మరో 15మంది ఉన్నారు.

# నిరుద్యోగుల పోరుబాటపై జులుం

- టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి భగ్నానికి పోలీసుల యత్నం
- విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్టులు.. ఠాణాలకు తరలింపు
- ఖండించిన నాయకులు



నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

**ప్రభుత్వోద్యోగాల భర్తీ కోసం విద్యార్థి, యువజన సంఘాలు పోరుబాట పట్టాయి. 'నిరుద్యోగుల మార్చ్', టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి నిరుద్యోగ జేఏసీ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్నద్ధమయ్యాయి. దీంతో నాయకులు హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేయగా, ఇవి అక్రమ అరెస్టులంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఖండించారు. దొంగరాత్రి ఇండ్లలోకి వచ్చి అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఉద్యోగాల పేరిట కాంగ్రెస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు మాని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటు జిల్లాల్లోనూ నిరసనలు తెలిపారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.**

పెద్దపల్లి, జూలై 5(నమస్తే తెలంగాణ) : నిరుదోగ్య మార్చ్‌లో భాగంగా టీజీపీఎస్సీ ముట్టడిలో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సన్నద్ధమైన బీఆర్‌ఎస్ విద్యార్థి, యుజన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కరీంనగర్‌లో వివిధ విద్యార్థి నాయకులు, బీఆర్‌ఎస్ శ్రేణులను శుక్రవారం ఉదయం నుంచే పోలీసులు అరెస్టు చేసి సేష్టన్‌కు తరలించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపతి నాయక్, బీఆర్‌ఎస్ విద్యార్థి నాయకులు, తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి వీణవంక, ఇల్లందకుంట నుంచి బయలుదేరిన బీఆర్‌ఎస్‌వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్లలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి సబ్బిని హరీశ్‌తో పాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్‌కాలనీ నుంచి విద్యార్థి, యువజన నాయకులను గోదావరిఖని టూ టౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి విద్యార్థి నాయకుల ఇళ్లలోకి వెళ్లి అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. పెద్దపల్లి నుంచి వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులను, బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. కథలాపూర్ మండలంలోని నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



సత్యగ్రహ దీక్ష చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష

### ఇంట్లోనే సత్యాగ్రహ దీక్ష

పెద్దపల్లి బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉషను పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారు. దీంతో ఆమె జిల్లాకేంద్రం శాంతినగర్‌లోని తన నివాసంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు అసలు జాబ్ క్యాలెండర్ వేయడం లేదని మండిపడ్డారు. మోసపూరిత మాటలను నమ్మి ఏ యువకుడైతే కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించుకున్నాడో ఇప్పుడు ఆ యువకుడే ఆగ్రహానికి గురవుతున్నాడని, వారు మర్లబడితే కుర్చీని వదిలేసి వెళ్లిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

### పింఛన్లు పెంచండి మహాప్రభో

పెద్దపల్లి, జూలై 5: 'పింఛన్లు పెంచండి మహాప్రభో' అంటూ దివ్యాంగులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. వచ్చే పెన్షన్ డబ్బులతోనే జీవితాలను వెల్లదీస్తున్నామని, తమ బతుకులతో ఆడుకోవద్దని ఆవేదనగా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ దివ్యాంగుల పెన్షన్ ₹6వేలు, వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళా, బీడీ, గీతా కార్మికులకు ₹4వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ, ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలైనా పెన్షన్ పెంపుపై ప్రకటన చేయకపోవడం తమన కలిచి వేస్తున్నదని ఆవేదన చెందారు. ఫించన్ పెంపు హామీని అమలు చేయాలని, అది డిసెంబర్ 2023 నుంచే ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ బస్సులో ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఐరెడ్డి నారాయణ రెడ్డి, శీలారపు పర్వతాలు, అమీర్‌బేగ్, ఏ రాజేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# గనుల వేలంపై కన్నెర్ర

- కార్మిక వాడల నుంచి కదిలిన దండు
- కరీంనగర్, పెద్దపల్లి కలెక్టరేట్‌ల ముట్టడి
- గనుల వేలాన్ని ఆపాలని వామపక్షాల మహాధర్నా
- సింగరేణికే కేటాయించాలని డిమాండ్
- బీజేపీ, ప్రధానికి వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాలు



పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

**సింగరేణి బొగ్గు గనుల వేలంపై కార్మిక లోకం కన్నెర్రజేసింది. వామపక్ష పార్టీలు, సింగరేణి కార్మిక సంఘాలతో కలిసి గర్జించింది. కరీంనగర్, పెద్దపల్లి కలెక్టరేట్‌ల ఎదుట మహాధర్నాకు దిగింది. ప్రైవేటీకరణ విధానాలను మాను కోవాలని, బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని సింగరేణికే ఆ గనులను కేటాయించాలని డిమాండ్ చేసింది.**

పెద్దపల్లి, జూలై 5(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలోని కార్మిక క్షేత్రాలైన గోదావరిఖని, యైటింక్లైన్‌కాలనీ, సెంటినరీకాలనీల నుంచి కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మహాధర్నా నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి మోదీకి వ్యతిరేకంగా నినదించారు. ఉదయం నుంచి ఆయా కార్మిక వాడల నుంచి బైక్‌లకు ఎర్రజెండాలు బిగించి బైక్‌లతో ర్యాలీగా తరలివచ్చిన కార్మికులు కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బొగ్గుగని బ్లాక్‌ను సింగరేణికే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. వామపక్ష కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఐఎంఎల్ న్యూడెమక్రసీ, ఐఎఫ్‌టీయూల నాయకులు, కార్యకర్తలు మహాధర్నాలో పాల్గొన్నారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, నాయకులు

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 5 : కరీంనగర్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ప్రతినిధులతో పాటు ఆల్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా శాఖల నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బొగ్గు బ్లాకుల వేలంపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ఐక్య ఆందోళనలకు దిగారు. ప్రజాభీష్టానికి భిన్నంగా పాలన ప్రారంభించిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571